# సత్యం వధ - ధర్మం చెర

అవధానుల జగన్నాథ రావు & మల్లంపల్లి గాంధీ రామారావు

బస్సుదిగి గాభరాగా జేబులు తడుముకున్నా.

ఒంటినిండా చెమట్లు పట్టేశాయి. కాళ్ళ కిందనున్న భూమి అలా పాతాళంలోకి దిగిపోయినట్లనిపించింది. నవనాడులూ ఎవరో బలవంతంగా బంధించినట్లయింది. ఈనగాచి నక్కలపాలు చేసినట్లయింది పరిస్థితి. నెల జీతమంతా జాగ్రత్తగా పెట్టి, ధ్యానమంతా జేబులోని పర్సుమీదే ఉంచుకున్నా, దిగడం హడావుడిలో ఎవడో ఒడుపుగా కొట్టేశాడు.

ఒంటిమీదకి కాస్త తెలివి వొచ్చేసరికి, దిగిన బస్సు కనుచూపుమేర దాటి వెళ్ళిపోయింది. నాతో బాటుదిగిన మరి నలుగురూ, నాలుగు వైపులా వెళ్ళిపోయారు.

ఏం చేయడానికీ తోచలేదు. సిగరెట్ వెలిగించి, గట్టిగా ఓ దమ్ములాగి ఇంటివైపు నడక సాగించాను. కాలింగ్‌బెల్‌కి తలుపు తీసిన శ్రీమతితో మాట్లాడకుండా నేరుగా బెడ్‌రూమ్ లోకిపోయి మంచంమీద కూలబడ్డా.

కళాకాంతులు లేని ముఖం చూసేసరికి శ్రీమతికి అర్ధమయిపోయింది — ఏదో జరగకూడని విషయం జరిగిందని. మాట్లాడకుండా, చల్లటి మంచినీళ్ళు ఓ గ్లాసు చేతికందించి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

''కాఫీ తీసుకోండి. కాస్త సుళువుగా ఉంటుంది'' అంది సీత.

చిక్కటి కాఫీ గొంతులోకిపడేసరికి మనస్సుకి హాయిగా అనిపించింది.

పక్కనున్న స్టూలుని మంచానికి దగ్గరగా లాక్కుని, నుదిటిమీద చేయి వేసి ''ఏం జరిగిందండీ ?'' అంది ప్రేమగా. సీతలోని ఆ నిబ్బరమంటేనే నాకు ప్రేమ. వచ్చిన వెంటనే ప్రశ్నలతో వేధించకుండా అవసరాలు గమనించి నడుచుకొనే ఆ తత్వం నాకెంతో యిష్టం.

''పర్సు ఎవడో కొట్టేశాడు సీతా !'' అన్నాను దిగులుగా — గడపవలసిన నెల రోజులు జ్ఞాపకంవచ్చి. ఎంత దాచుకుందామనుకున్నా గొంతులోని దుఃఖం బయటపడిపోయింది. నాకు తెలియకుండానే కళ్ళు చెమ్మగిల్లాయి.

ఐదు నిముషాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది,

''పోలీస్ రిపోర్ట్ యిచ్చారా ?'' అడిగింది సీత. అప్పుడు జ్ఞాపకం వచ్చింది — దొరకడానికి అవకాశం, ఆశా లేశమాత్రమే ఉన్నా, దానిక్కూడా పోలీస్ రిపోర్టీయాలని ముఖం కడుక్కొని యిద్దరం కలసి, దగ్గర్లోనే ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టిచ్చివచ్చాం.

* * *

పరామర్శనీ, ఓదార్పునీ బొత్తిగా సహించలేని తత్వం నాది. ఆఫీసులో అందరికన్నా ముఖ్య సన్నిహితుడయిన విశ్వానికితప్ప, మరెవరికీ జరిగిన జేబు దొంగతనం గురించి చెప్పలేదు.

ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోయి, మెల్లగా పనిలోకి జారుకుందామనుకునే తరుణంలో ''థాంక్స్ ! గురూగారూ !'' అన్న వెంకట్రావు పిలుపు విని తలపైకెత్తాను.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని, నెమ్మదిగా నా చేతికి రెండు వంద నోట్లు అందించాడు.

''ఏమిటివి ?'' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను.

''నిన్న జీతాల్రోజు నాకు అర్జంటు అవసరం వచ్చి మీ దగ్గర తీసుకున్నాకదండీ. ఇంటికెళ్ళే హడావుడిలో మరిచిపోయుంటారు'' అన్నాడు వెంకట్రావు నెమ్మదిగా.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది— ఆ రోజేదో ఆఫీసు పనిమీద బైటకెళ్ళిన వెంకట్రావు వచ్చేసరికి పే క్లార్క్ వెళ్ళిపోయాడని, అందువల్ల వెంకట్రావు చేబదులుగా రెండువంద లడిగి తీసుకున్నాడనీ.

''మీకే నేను థాంక్స్ చెప్పాలి... సరిగ్గా టైముకి సొమ్ము తిరిగి యిచ్చినందుకు'' అని వెంకట్రావుతో అన్నప్పుడు ఆయన నా వైపు అదోలా చూశాడు.

నా జేబెవడో కొట్టేశాడన్న విషయం తెలియని వెంకట్రావుకి నా మాటల్లో కృతజ్ఞత కన్నా, వ్యంగ్యం ఎక్కువగా కనిపించిందేమో?

* * *

బస్సు దిగి యింటి మొహం పడుతూ... జేబు తడుముకున్నా. భద్రంగా ఉన్న కొత్త నోట్లు మనసుకి హాయినిచ్చాయి. వీధంతా నిశ్శబ్దంగా ఉంది.

సడెన్‌గా ఓ సైకిల్ ఎదురుగా వచ్చి నా ముందు ఆగింది. ''మాస్టారూ ! నిన్నగాని మీ పర్స్ పోయిందా ?'' ఎంతో సౌమ్యంగా అడిగాడు కేరేజ్ మీద నుండి దిగిన మనిషి. చీకటి పడిపోయినా ఇద్దరూ చలవ కళ్ళజోళ్ళు తీయలేదు సైకిల్ తొక్కిన మనిషి మాత్రం ముక్కరుడిలా ఉన్నాడు. పర్స్ విషయమై ఆచూకీ తెలుస్తుందన్న సంతోషం, వారి రూపు రేఖల్ని అంతగా గమనించ నీయలేదు.

''అవునండీ !'' — అన్నాను ఆత్రంగా ఉదయం దొరికిన రెండు వందలతో బాటు మిగిలిన ఎనిమిది వందలు కూడా దొరికిపోతాయన్న ఆశతో.

''ఎంతపోయింది ?'' అడిగాడు మారుతున్న గొంతులో కాస్త సౌమ్య రసాన్ని నింపుతూ.

''ఎనిమిది వందలు''—అన్నాను హుషారుగా.

''పోలీస్ స్టేషన్‌లో ఎంతకి రిపోర్టిచ్చావు?'' గొంతులోని సౌమ్యత కాస్త తగ్గడమే కాకుండా, ఏకవచన ప్రయోగంలోకి దిగిన— ఆ మనిషి మీద తొలిసారిగా కాస్త అనుమానం వేసింది — మంచివాడు కాదేమోనని. అయినా అవసరం నాది. కాస్త ఆలోచించే సరికి జ్ఞాపకం వచ్చింది — వెంకట్రావు చేబదులు తీసుకెళ్ళిన రెండు వందల గురించి మరచిపోయి, వెయ్యిరూపాయలు పోయాయని పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చినట్లు.

''వెయ్యి రూపాయిలు'' అన్నాను వెర్రి వెధవలా.

''ఏం ? ఒళ్ళు తిమ్మిరెక్కిందా ?''అంటూ ఆ దవడా ఈ దవడా చడామడా చాచి నాలుగైదు లెంపకాయలు కొట్టాడు— అంతవరకూ మాట్లాడకుండా నిల్చున్న ఆసామీ.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి కళ్ళు బైర్లుకమ్మాయి. గొంతెత్తి గట్టిగా అరవబోయాను సహాయం కోసం. ''అరిచావంటే జాగ్రత్త !'' అని పక్కన్నిల్చున్న ఆసామీ చేతిలోని కత్తి మోచేతికి తగిలి నెత్తురు చిమ్మింది. అరుద్దామన్న ఆలోచనకి ప్రాణభీతి ఆనకట్ట వేసింది.

''పెద్ద లచ్చాధికారి లాగ తయారయి, జేబులో ఏడుపుగొట్టు ఎనిమిదొంద లెట్టుగొని, ఎయ్యి రూపాయిలు పోనాయని రుపోర్టిత్తావా ఎదవనాయాలా ! నీ జోబులోని ఎనిమిదొందలూ నా ఒక్కడి నోట్లోకే పోతాయనుకున్నావేటి -

తప్పులెక్క సెప్పినా సరిపోడానికి. జేబు కొట్టిన గంటకల్లా పోలీస్ స్టేషన్‌కాడ సగం డబ్బు జమ సెయ్యకపోతే... మా పేనాలుంచుతారేటి ఆ పొయాల్లు. నీ ముష్టి రెండొందల తప్పు లెక్కకీ నా మక్కె లిరగదొబ్బాడా హెడ్డు. ఈ యిసయం మళ్ళా పోలీసోళ్ళకి సెప్పావంటే నువ్వు వల్లకాట్లోకి... నేను జైల్లోకి జాగర్త" అంటూ జుత్తు పట్టుకులాగి మరి రెండు వాయించాడు. నిస్సహాయుడనై తన్నులు తినడం తప్పించి మరేమీ చేయలేకపోయాను.

ఏదో టెంపో వస్తున్న చప్పుడు విని... వాళ్ళిద్దరూ సైకిలెక్కి తిరిగి తొందరగా వెళ్ళిపోయారు.

* * *

మర్నాడు ఆస్పత్రి ఖర్చులకీ, ఎక్స్‌రేంకీ, డాక్టర్ల ఫీజులకీ ఆ రెండొందలూ ఖర్చయిపోయాయి. ఆప్తమిత్రుడు విశ్వానికి కూడా ఈ విషయం చెప్పడానికి మనసంగీకరించలేదు.

★

